వాల్మీకి విరచిత రామాయణమునందలి

# సుందరకాండ

- శ్రీ ప్రభావతీ దేవి

**అవిఘ్నమస్తు**

**ఓం**

## ప్రార్థన శ్లోకములు

శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే
రామాయరామ భద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాధాయ నాధాయ సీతాయాఃపతయే నమః

## వాల్మీకి ప్రార్థన

కూ జంతం రామ రామేతి మదురం మధురాక్షరమ్
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్
వాల్మీకేర్ముని సింహస్య కవితా వనచారిణః
శృణ్వన్ రామ కధానాదంకోనయాతి పరాంగతిమ్

## ఆంజనేయ ప్రార్థన

అంజనా నందం వీరం జానకీ శోకనాశనమ్
కపేశ మక్షహం తారం వందే లంకాభయంకరమ్
గొష్పదీకృత వారాశిం మశకీకృతరాక్షసం
రామాయణ మహామాలారత్నం వందే నిలాత్మజమ్

మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూ ధముఖ్యం
శ్రీరామ దూతం శిరసా నమామి

* * *

# ముందుమాట

వాల్మీకి విరచిత రామాయణ కావ్యమున, బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధకాండములు ఆరు గలవు.

ఒక్క సుందరకాండలో తప్ప మిగిలిన అయుదు కాండలలో, వాటిలోని కథాంశమును బట్టి ఆయా పేర్లతో విభజించబడినవి.

సుందరకాండ అత్యంత విశిష్టమయినది. ఇది నిత్య పారాయణ గ్రంథము. ఈ నాటి యువతలో చాలామందికి సుందరకాండను గూర్చి గాని దాని ప్రాముఖ్యతను గురించి గాని తెలియదు. అందువల అత్యంత సుందరమయిన సుందరకాండను సంక్షిప్తముగా సులభమయిన భాషలో రచించుట జరిగినది.

సుందరకాండ ఎందువలన సుందరమయినది అనగా రాముడు సుందరుడు, సీత సుందరమయినది, హనుమ సుందరుడు, వనము సుందరమయినది, రామాయణ మహా కావ్యము సుందరమయినది, ఇందలి మంత్రము సుందరమయినది.

* * *

## ప్రారంభ శ్లోకము

సుందర కాండ, వాల్మీకి మునీంద్రులు ఈ విధముగా ప్రారంభించిరి.

తతోరావణ నీతాయాః సీతాయాశ్శత్రు కర్శనః
ఇమేష పదమన్వేష్టుం చారణాచరితేపథిః

అనగా జాంబవంతునిచే ప్రభోదింపబడిన శతృవినాశకుడగు మారుతి రావణునిచే అపహరించబడిన సీతాదేవి యొక్క జాడ తెలిసికొనుటకయి ఆకాశమున ఎగురుటకు సంసిద్ధుడయ్యెను. మహో బలవంతుడు, ధీరుడు, ధీమంతుడు అయిన హనుమ సముద్రమునకు ఆవల గల లంకలో సీతమ్మ గలదని పక్షిరాజు సంపాతి వలన తెలిసికొని సముద్రమును లంఘించుటకు ఉద్యుక్తుడాయెను.

ముందుగా మహేంద్ర పర్వతముపై కాలు మోపి పర్వతమును అణిచెను. తదుపరి సూర్యునకును, ఇంద్రునకును అతని పితృదేవుడయిన వాయుదేవునకు, బ్రహ్మకును, సమస్త భూతములకును అంజలి ఘటించెను. కొలది యేనట్లు తన శరీరమును బెంచెను అపుడు అంగద జాంబవంతులతో ఇట్లనెను 'రావణ రక్షితమయిన అంకకు బోయెదను" అచ్చట సీతమ్మను కనుగొనలేకపోయితినో అలసట నొందక నాగ లోకములోను, స ర్గ లోకములోను వెతికెదను. లంకలో ఉన్నచో రావణ సహితముగా లంకను పెకిలించుకొని, ఏ విధము నయినను సీతమ్మను తీసికొని వచ్చెదను అని పలికి అతులిత బలధాముడయిన

మారుతి ఆకాశ మార్గమున లంఘించెను. ఇట్లు ఆకాశ మార్గమున పయనించుచున్న మారుతిని ఋషులు దేవ గంధర్వులు ఎంతగానో శ్లాఘించిరి.

హనుమ యొక్క అద్భుత కార్యమును తిలకించిన సముద్రుడు తనలో దాగియున్న మైనాక పర్వతముతో నిట్లనెను. "మారుతి రామ కార్యార్థమయి ఆకాశ మార్గమున త్వరిత గతిని పోవుచున్నాడు. మారుతికి శ్రమ కలుగకుండ నీవు వానికి కొంతసేపు ఆతిధ్యమిచ్చి తోడ్పడుము'. మైనాకుడు అటుల చేయుటకై సముద్ర గర్భమునుండి పైకి వచ్చి మారుతికయి వేచియుండెను.

మైనాకుని ఉద్దేశ్యము తెలియని మారుతి ఆ పర్వతము తనకొక విఘ్నమని తలచి వాయు వేగమున వక్షముతో గిరిని కూల్చెను.

మైనాకుడు మారుతి వేగమునకు అబ్బురపడి మానవ రూపము దాల్చి ఇట్లు పలికెను. "ఆంజనేయా నీవు దుష్కరమయిన కార్యమును చేపట్టినావు. కావున కొంత తడవు నాపై విశ్రమించినా పూజలు స్వీకరించి నన్ను సంతుష్టుని చేయుము' ఆంజనేయుడు మైనాకుని ప్రేమతో స్పృశించి 'నేను నెరవేర్చవలసిన కార్యము అత్యంత విశిష్టమయినది. రామ కార్యసిద్ధికయి ఆకాశవీధిని సాగరమును లంఘించుచుంటిని. ఎన్ని అంతరాయములు గలిగినా ఆలసింపక ప్రయాణము గావింతునని శపధము చేసినాను. నీ ఆతిధ్యము స్వీకరించినట్లే తలచి నాకు శలవిమ్మనెను. ఇట్లు విశ్రమింపకుండ పయనించుచున్న మారుతిని గాంచి ఋషులు పొగడిరి. దేవ గంధర్వులు శ్లాఘించిరి. ఇది ఒక మహో కార్యమని పలికిరి.



వారు ఇంకను హనుమ ప్రతాపమును తిలకింపదలచిరి.

సురసాదేవి నాగమాత, ఆమెను రాక్షస రూపమును దాల్చి భయంకరమయిన కోరలతో పెద్దగా నోరు తెరచి కొంత తడవు హనుమను ప్రతిఘటింపమని చెప్పిరి. ఆమె అట్లేయని సాగర మధ్యమున కురూపిగా మారి, 'హనుమా నీవు నాకు ఆహారముగా నొసగబడితివి. కావున నిన్ను నేను భక్షింపవలెను అని నోరు తెరచినా నోటిలో ప్రవేశింపుము అనెను.

ఆమె నోరు ఎనుబది యోజనముల పొడవు పెంచెను. హనుమ తొంబయి యోజనములు తన దేహమును బెంచెను. ఆమె శత యోజనములు తన నోటిని పెంచెను. సూక్ష్మబుద్ధిగల మారుతి వెంటనే అంగుష్ఠమాత్రుడయి ఆమె నోటిలోనికి జొచ్చి వెంటనే బయటకు వచ్చెను.

ఆమెతో నిట్లనెను "నీవు కోరిన రీతిలో నీ నోట జొచ్చితిని. నేను వైదేహిని అన్వేషింపవలెను. నాకు శలవునీయమనెను. సురస ఎంతయో సంతసించి నిజ రూపమును దాల్చి హనుమంతుని ప్రశంసించి నీకు కార్య సిద్ధిగలుగును. సీతాదేవిని శ్రీరామునితో గలుపుము అని దీవించెను.

హనుమ సాధించిన రెండవ అద్భుత కార్యమని సకల భూతములు వానిని ప్రస్తుతించిరి.

మారుతి ఆకాశ మార్గమున గరుత్మంతుని వలె ఎగురసాగెను. ఇట్లు ఎగురుచున్న అతనిని చూసి సింహిక అను రాక్షసి నాకు చాలా

కాలమునకు తగిన ఆహారము లభించినది అని తలచి ఆంజనేయుని నీడను బట్టి అతనిని తన వైపునకు ఈడ్చుకొనసాగెను.

క్షణ కాలము కుంటుబడిన పరాక్రమముగలవాడయి హనుమ అటునిటు చూడసాగెను. వికృత రూపము గల కామ రూపధారిణి అయిన రాక్షసిని గాంచెను. ఆ రాక్షసి తన నోటిని తెరచి హనుమను వెంబడించెను. సూక్ష్మగ్రాహి అయిన హనుమ తెరచి ఉంచిన సింహిక నోట ప్రవేశించి దాని ఆయువు పట్టును చీల్చెను. సింహిక గుండెల దరి సముద్రమునబడెను. సింహిక చావు పవన సుతుని చేతనని పరబ్రహ్మ నిర్ణయించెను. ఇది హనుమ యొక్క మూడవ అద్భుత కార్యము. ఇది తిలకించిన గగనచరులయిన భూతములు హనుమంతుని నిశిత బుద్ధిని, అసమానమయిన సామర్థ్యమును బహువిధముల ప్రశంసించిరి.

(అత్యంత క్లిష్టమయిన కార్యమును కృషితో పట్టుదలతో సాధించిన హనుమ సర్వదా ప్రశంసనీయుడు)

మారుతి నూరు యోజనములు సముద్రముపై లంఘించి సునాయాసముగా లంకను జేరెను. రామ కార్యార్థి అయిన హనుమ తన లక్ష్యమును ఏ విధముగ సాధింపగలనని ఒక్క క్షణము యోచించెను. ఆ రాత్రిపరుల కంటబడకుండ ఒక చిన్న మార్జాలము వలె గోచరించుచూ లంకను ప్రవేశించుటకు ప్రయత్నించెను, లంకిణి అను రాక్షసి లంకా నగరమును సర్వ వేళల సంరక్షించుచుండెను. సూక్ష్మ రూపమున గల హనుమను తిలకించి 'నీవెవ్వరవు' అని ప్రశ్నించెను. 'తాను అత్యంత సుందరమయిన లంకానగరమును వీక్షించుటకు వచ్చితినని తెలిపెను హనుమంతుడు.



లంకిణి లంకా నగరమున ప్రవేశించుటకు తన అనుమతి లేదని తెలిపెను. హనుమ ఆమెను త్రోసి లంకా ప్రవేశమునకు ప్రయత్నించెను. లంకిణి ఆగ్రహ పూరితురాలయి తన కరతలముతో హనుమను కొట్టెను. హనుమ అత్యంత క్రోధ భరితుడయి లంకను గట్టిగా గొట్టెను. ఆ దెబ్బకు తాళలేక లంకిణి దిమ్మదిరిగి నేలపైబడెను.

భయవిహ్వల అయిన లంక హనుమంతుని క్షమ వేడి ఇట్లు పలికెను (పూర్వము బ్రహ్మ నాకొక వరము ఇచ్చెను. 'ఏ రోజు ఒక వానరుడు నిన్ను లోబరుచుకొనునో ఆ దినముననే లంకకు కీడు మూడును. లంక వినాశమునొందును. కావున కపివర్యా నాకు బ్రహ్మ ఇచ్చిన వరము ఫలించినది. ఇక నీవు యదేచ్ఛగా లంకలో ప్రవేశింపుము. నీ కార్యమును సఫలీకృతముగానిమ్ము' అని పలికెను. ఆంజనేయుడు మహా తేజస్వి త్రికూట పర్వతముపైన ఉన్న లంకలో మొట్టమొదట ఎడమ కాలు మోపి ప్రవేశించెను. లంకా నగరి బహు రమ్యముగానుండెను. అచట పలు విధములయిన ఫల వృక్షములను, పూదోటలను సుందర ఉద్యానవనములను, కలువల చేతను, తామరల చేతను నిండిన యగడ్తలను వీక్షించెను. విశ్వకర్మచే నిర్మితమయిన లంకాపురి సర్వాలంకృత భూషిత అయిన యువతివలె గానుపించెను. లంకలో ప్రవేశించిన హనుమ అచ్చట ఎన్నో సుందరమయిన భవనములను గాంచెను.

దేవ శిల్పి విశ్వకర్మచే సృష్టికర్త బ్రహ్మ కొరకు దేదీప్యమానముగ సృజియించిన పుష్పకమను విమానమును గాంచెను. పుత్తడి బొమ్మలవలె మెరిసెడి సహస్ర నారీమణులను హనుమ అచ్చట గాంచెను. వారందరు కులీనులే. రావణుని వలచి ఆతని భార్యలుగా వచ్చినవారు.

ఆ విమానమునందున రత్న భూషితమయిన రావణుని శయనాగారమును గాంచెను. అచ్చట ఒక శయనముపయిన అపురూప సౌందర్యవతి అయిన ఒక యువతిని గాంచెను. ఆమె రావణుని పట్ట మహిషి 'మండోదరి'. ఆమెను తిలకించి హనుమ ఒక్క క్షణము ఆమె సీతయని భ్రమించి ఉప్పొంగెను. కాని ఆ సంతోషము క్షణ భంగురమని గ్రహించి 'ఎంత పొరబడితిని, సీత మహాసాధ్వి, రాముని వియోగము వలన తల్లడిల్లుతూ ఉండును. ఈమె మండోదంరి సీత కాదు అని చింతించెను. సీతమ్మ ఇట్టి సుఖ శయనముపయిన విశ్రమించదు' అని తలచెను.

సీతాదేవి దర్శనమునకయి పవన సుతుడు తహ తహ లాడుతూ తన అన్వేషణ కొనసాగించెను. అచ్చట గల మందిరములన్నిటిని వెదకినను వివిధాకారులయిన స్త్రీలు గానుపించిరి గాని 'సీతమ్మ' కానరాదు. అచ్చట నుండి బయటకు జేరి తపిస్తూ, సీతమ్మగానుపించు వరకూ నేను మరలిపోను అని ధృడ నిశ్చయుడాయెను. సీతాదేవికి, రామలక్ష్మణులకు, ఇంద్రునకు, రుద్రునకు వాయువునకు ప్రణమిల్లి ముందడుగు వేసెను.



హనుమకు కొలది దూరములో ఒక ప్రాకారము, అందు రమ్యమయిన అశోక వనముగానుపించెను. హనుమ తన శరీరమును చిన్నగా జేసికొని ప్రాకారపు గోడపయిన నిలచి ఆ వన శోభను తిలకించసాగెను. ఆ వనము అపురూపమయిన పుష్పములు, ఫలములతో శోభించుచుండెను. అచ్చట గల ఒక శింశుప వృక్షము పైన కూచుని జానకిని అచటి నుండి వీక్షించగలనని తలచెను.

హనుమ తలచినట్లే అచ్చటి నుండి ఒక యువతిని గాంచెను. ఆమె వికృతాకారులయిన రాక్షస స్త్రీల నడుమ మలిన వస్త్రమును ధరించి ఉపవాసము చేకృశించి దీనురాలై యుండెను. అట్టి ఆమెను గాంచి హనుమ ఆమె సీతయేనని తలచెను. సీతాదేవిని కనుగొంటినని ఆనంద భాష్పములతో శ్రీరామ లక్ష్మణులను స్మరించుకొనెను.

ప్రాతఃకాలమున పావన ఘడియలలో వేద విద్య నేర్చిన అసురులు వేద ఘోష చేసిరి.

ఇంతలో మనోజ్ఞమయిన మంగళవాద్య ధ్వనులతో దశకంఠుడు మేల్కొని తన భార్యలతో దాసదాసీలతో అశోకవనమును జేరెను. సీతయందు లగ్నమయిన మనస్సుతో జడుని వలె రావణుడు మెల్లని నడకతో వచ్చుచుండెను.

అట్లు వచ్చుచున్న రావణుని జూచి సీత పెనుగాలిచే నూగులాడు అరటి చెట్టు వలె మిగుల కంపించెను. తొడలతో గడుపును, చేతులతో, స్తనములను కప్పకొని ముడుచుకొని కూర్చుని రోదింపసాగెను.

రావణుడు సీతతో నిట్లనెను. 'నీవు నాకు ఎంతో ప్రియమయిన దానివి. స్త్రీలలో రత్నము వంటి దానివి. అఖండ సౌందర్యవతివి, నీవు నాకు భార్యవగుము. నా భార్యలందరిలోను నీవు అగ్రేసురరాలవై నాకు అగ్ర మనిషివి కమ్ము. నా విలువయిన రాజ్యమును నేనును నీకే చెందియుండెదము'.

భయము గొల్పించు రావణుని మాటలను విని సీత ఒక గడ్డి పోచను రావణుని ముందుంచి ఇట్లనెను (ఓ రాక్షసా, రావణా, నీ భార్యలను నీవు ఎట్లు రక్షించుకొనెదవో అటులనే రాముని భార్యనయిన నన్ను శ్రీరామునికి సమర్పించుము, అట్లు చేయనిచో వజ్రాయుధము నిన్ను వధించకపోయిననూ, యముడు నిన్ను గొనికోకపోయిననూ రాముని బాణమునకు నీవు తాళలేవు'.

సీతాదేవి పలికిన ఈ పలుకులు విని రావణుడు ఆగ్రహముతో సీతతో నిట్లనెను. 'నీకు ఇచ్చిన గడువు ఇక రెండు మాసములే ఉన్నది. గడువు ముగియగానే నీవు నన్ను వరించి నాతో శయనింపని యడల నీకు మరణము తథ్యము. ఇచ్చటి రాక్షస స్త్రీలు నిన్ను చంపి వండి భక్షించెదరు' అని చెప్పి అచ్చటి స్త్రీలతో సీత మనసు నా పైన మరల వలెను. మీరు సామ దాన భేదోపాయములతో ఆమెను వశము జేసికొనుడు అని తెలిపెను.

ఆ రాక్షస వనితలు క్రోధముగా సీతతో కర్కశముగ ఇట్లు పలికిరి. పులస్త్య ప్రజాపతి వంశమున జన్మించిన వాడు అఖండమయిన ఐశ్వర్యము గలవాడునగు రావణుని వరించుము. లేనిచో నీ



శరీరమును ఖండ ఖండములుగా కోసి మేము భుజించెదము అనిరి. ఇంకను పలు పలు విధములుగా జానకిని బాధింపసాగిరి.

జానకి ఆ రాక్షస స్త్రీలతో ఇట్లనెను. రఘుకుల తిలకుడు నా భర్తకు నేనిచట నుండిన విషయము తెలియదు. నేనిచట నుండెనని తెలిసినచో రౌద్రుడయి, ధనుర్ధరుడై ఈ జగమున రాక్షసులే లేనట్లు చేయును. రావణుని సంహరించగనే ఇక లంక ఉండదు. అందు గల రాక్షసులందరు మరణింతురు. వారి భార్యలు నా వలె భగ్న హృదయులై ఆక్రందింతురు. ఈ మాటలు విని ఆ రాక్షస వనితలు క్రోధులయి "నిన్ను చంపి రుచికరమగు నీ మాంసమును భక్షింతుము' అనిరి.

ఇంతలో త్రిజటయను ఒక వృద్ధ రాక్షసి నిద్ర నుండి మేల్కొని వారితో నిట్లనెను. నేను నిద్రలో మేల్కొనగ ఒక దారుణమయిన కలను గంటిని. ఆ కల రాక్షస వినాశ కారకమయి శ్రీరాముని విజయమును సూచించుచున్నది అని ఆమె స్వప్న వృత్తాంతమును ఇట్లు వివరించినది.

సీత తెల్లని వస్త్రములు ధరించి సముద్రమునందలి పర్వతముపై నుండుటను చూచితిని. ఏనుగు దంతములతోను వేయిహంసలతోను గూడియున్న ఒక దివ్యమయిన పల్లకిని జూచితిని. అందు తెల్లని వస్త్రములు, తెల్లని పుష్ప మాలలను ధరించిన రామ లక్ష్మణులను జూచితిని. వారిద్దరు సీత వద్దకు వచ్చిరి. రాముడు ఆమెను పరిగ్రహించి తన వద్ద కూచొనబెట్టుకొనెను. ఆ తరువాత దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు బ్రహ్మను ముందుంచుకొని రామునకు నమస్కరించిరి. ఆ ఆసనమునందే రాముడు విష్ణువుగా మారుటను జూచితిని.

రావణుడు ఎఱ్ఱని వస్త్రములు ధరించి శరీరమంతయు నూనెను పూసుకుని నేలపై నుండుటను చూచితిని. సహింపరాని దుర్గంధముతో నిండిన మలపంకములో మునిగి పోవుటను జూచితిని. ఆ విధముగానే కుంభకర్ణుడు, రావణుని పుత్ర్యలందరు నూనెను రాసుకుని యున్నట్లు కానవచ్చిరి. ఒక్క విభీషణుడు మాత్రము తెల్లని వస్త్రములు ధరించి శోభాయమానముగ కనిపించెను. ఈ కల రావణుని పరాజయము రాక్షసుల వినాశనము, రాముని విజయమును తెలుపుచున్నది. కావున మీరు సీతాదేవిని వేధించవలదు అని హితవు పలికినది.

సీతాదేవి రావణుడు తనను బెదిరించి వెళ్లిన పిదప ఇక తాను రాముని జేరుట దుర్లభమని తలచినది. తన జడతోనే తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొనవలెనని తలచినది. అపుడు వైదేహికి శుభ శకునములు చుట్టుముట్టినవి..

పవన సుతుడు శింశుప వృక్షము పైనుండి సీతకు రాక్షసులచే బెదిరింపులు త్రిజట కల విశేషములు గమనించిన వాడయి ప్రాంతః కాలమునకు ముందుగానే సీతమ్మను ఊరడించని యడల ఆమె ఉరి బోసుకుని మరణించుట తథ్యమని తలచెను.

శింశుప వృక్షముపయిన నుండి హనుమ సీతమ్మను ఉద్దేశించి మనోజ్ఞమయిన పలకులును బలికెను.

నేను రాముడు తెలుపమన్న పలుకులను తెలుపుచుంటిని.



(దశరథ మహారాజు ఘనుడు, ధర్మాత్ముడు, పుణ్యమూర్తి, కీర్తిని గడించినవాడు. ఆ దశరథ మహారాజు యొక్క అనుంగు పుత్రుడు శ్రీరాముడు. శ్రీరాముడు ధర్మజ్ఞుడు ధర్మవేత్త. ఒకానొక దురదృష్ట సమయమున దశరథుడు తన మూడవ భార్య కైకకిచ్చిన వరముల వలన శ్రీరాముని పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయవలెనని చెప్పెను. రాముడు పితృ వాక్య పరిపాలకుడు. భార్య సీతతోను సోదరుడు లక్ష్మణుని తోను గలసి వన వాసముచేయుచుండెను ఆ సమయమున శ్రీరాముడు వనములో గల ఋషులకు హాని కలుగజేయుచున్న అసురులను సంహరించెను. ఇది విని రావణుడు రామునిపై ఆగ్రహించెను. శ్రీరాముని భార్య సీతాదేవి అద్భుతమయిన సౌందర్య రాశియని తన సోదరి తాటకి ద్వారా తెలుసుకొనెను. సీత పయిన మరులుగొని మాయా మృగముతో రామలక్షణలను వంచించి ఆశ్రమమున ఏకాకిగానున్న సీతాదేవుని మాయా రూపియై అపహరించెను. శ్రీరాముడు మహా పతివ్రత అయిన సీత కొఱకు వనమంతా గాలించించుండగా వానర ప్రముఖుడయిన సుగ్రీవుని కలిసెను.

సుగ్రీవుడు వాలి సోదరుడు. వాలి సుగ్రీవుని భార్యను అపహరించెను. సోదరునితో ఎన్నో పర్యాయములు పోరాటము సాగించిన సుగ్రీవుడు, వాలితో పరాజితుడాయెను. తాను వాలిని సంహరించలేనని తెలిసిన సుగ్రీవుడు శ్రీరాముని శరణు వేడెను. వారిద్దరికి మైత్రి కుదిరెను. శ్రీరాముడు వాలిని సంహరించి సుగ్రీవుని కిష్కిందకు పట్టాభిషిక్తుని చేయుటకు, సుగ్రీవుడు తన వానర సమూహమును సీతను వెదికి కనుగొనుటకు అంగీకారము కుదిరెను.

శ్రీరాముడు వాలిని సంహరించి సుగ్రీవుని కిష్కిందకు పట్టాభిషిక్తుని గావించెను.

నేను సుగ్రీవుని మంత్రిని. నా పేరు హనుమంతుడు. నా తండ్రి వాయుదేవుడు. నేను శత యోజనముల సాగర లంఘనము చేసి సీతమ్మ కొరకు వెదుకుతుండగ శ్రీరాముడు తెలిపిన గుర్తులను బట్టి ఇచ్చట జానకీ మాతను చూచితిని అని పలికెను.

సీతాదేవి అమితమయిన ఆశ్చర్యముతో పైకి జూడగ అచ్చట మెఱుపులాంటి దేహముపయిన ధవళ వస్త్రములు ధరించిన హనుమంతుడు కనిపించెను. అతడు పింగళ వర్ణము గలవాడు.

ఆమె వానరుని జూచి చలించెను. బృహస్పతికి ఇంద్రునకు, బ్రహ్మకు, అగ్ని దేవునకు నమస్కరించి ఈ వానర వర్యుడు తెలిపిన దంతయు సత్యమగు గాక అని ప్రార్థించెన.

హనుమ శింశుప వృక్షముపైనుండి దిగి జానకికి నమస్కరించి ఇట్లనెను. 'అమ్మా అందమయిన ముఖము కలదానవు. నీవు రుద్ర గణములో జేరిన దానివా, మరుద్గణములో జేరిన దానవా, వసు గణములో జేరినదానవా లేక దుష్ట రావణుని చెఱలో దుఃఖించుచున్న జానకివా? రాముడు వనవాసమున నుండి తన భార్య జానకి కొరకు మిగుల విలపించుచున్నాడు. నీవేనా ఆయన భార్య అయిన జానకవి? నీవేనా ఆమెవు? అని ప్రశ్నించెను.



పతి దేవుని ప్రసక్తి విని జానకి పరమానందభరితురాలయినది. తాను శ్రీరాముని భార్యనని హనుమతో చెప్పినది. రావణుడు తనను అపహరించి ఒక సంవత్సరము గడువులో అతనిని వివాహమాడవలెనని లేనిచో గడవు పూర్తి కాగానే తనను సంహరించునని తెలిపెను. గడువు కాలము ముగియుటకు ఇక రెండు నెలల కాలమే ఉన్నదని తెలిపెను.

మారుతి, జానకి మాట విని ఆమెతో అనునయముగానిట్లు పలికెను. 'తల్లీ శ్రీరాముని సందేశము తెచ్చితిని. నీ క్షేమము తెలిసికొనవలెనని శ్రీరాముడు వేచియున్నాడు'.

మారతాత్మజుడు, సీతాదేవికి సంతోషము గల్గించే మా'టలను ఇట్లు చెప్పెను.

'శ్రీరాముడు సూర్యుని తేజస్సు గలవాడు. మన్మధుని వలె సౌందర్యవంతుడు. భూదేవికి గల సహనము గలవాడు. బుద్ధియందు బృహస్పతి, ఇంద్రుని వలె యశోధనుడు ధర్మపాలనా నిరతుడు. వేద వేదాంగ పారంగతుడు. బహుజన ప్రీతి గణించిన పావనుడు.

కౌసల్యాదేవి ఇచ్చిన సగ పాయసము వలన సువర్ణ దేహ కాంతితో సుమిత్రకు జన్మించినవాడు లక్ష్మణుడు. శ్రీరాముని వంటి గుణగణములు గలవాడు. రామునితో సుగ్రీవునికి సమాగమము జరిగిన పిదప సుగ్రీవుడు వేలకొద్ది వానర శ్రేష్ఠులను నిన్ను వెదుకుటకు పంపెను. నా పేరు హనుమంతుడు. నేను వాయుదేవుని వలన నా తల్లికి జన్మించితిని. నేను సుగ్రీవుని మంత్రిని. రామ లక్ష్మణుల దూతనయి నేను నూరు యోజనముల సాగరమును లంఘించి ఇచ్చటకు వచ్చితిని.

శ్రీరాముడు శీఘ్రముగా ఏతెంచి మిమ్ము రక్షించి తిరిగి గొనిపోవును. సీతమ్మ ఈ చల్లని మాటలను విని ఎంతగానో ఊరట పొందినది.

హనుమ ఇంకను ఇట్లు చెప్పెను. 'శ్రీరాముడు సీతాదేవికి హనుమ పయిన నమ్మకము గల్గు కొరకు తన ముద్రికను పంపెను' అని ఆ అంగుళీయకమును చూచి సీత పరవశించినది.

ఈ విధముగా సీతాదేవిని ఊరడించి హనుమ ఆమె ఆత్మహత్యా ప్రయత్నమును నివారించెను.

*(ఈ సందర్భముగా ఒక్క మాట (రచయిత్రిది))*

*రామ ముద్రికను హనుమ సీతాదేవికిచ్చి ఆమె ఉరి వేసికొను ప్రయత్నము నివారించెను. సీతాదేవిని మృత్యుముఖమునుండి తప్పించెను. ఈ కథనమంతయు సుందరకాండలో 36వ సర్గలో పొందుబరచబడినది. సమస్యలు, కష్టములు చుట్టుముట్టినప్పడు సుందరకాండలో 36వ సర్గను నలుబది దినములు అనగా ఒక మండలము నియమనిష్ఠలతో పారాయణ చేసి ప్రతి నిత్యము శ్రీ ఆంజనేయస్వామికి పాలతో చేసిన పాయసము నివేదన చేసి, కొబ్బరికాయ కొట్టిన యడల అన్ని కష్టములు తొలగి సుఖముగా జీవించగలరు)*

హనుమ సీతాదేవి వద్ద శలవు తీసికొని ఆమె ఆశీస్సులు పొందెను.

హనుమ సీతను కలిసి ఆమెకు సంతసము కలిగించి ఉత్తర దిశకు పోవుటకు సంసిద్ధుడాయెను. ఇంతలో హనుమకు మరియొక



ఆలోచన వచ్చెను. లంకలోని రాక్షసులతో యుద్ధము చేసి వారి బలా బలములను తెలిసికొనగోరెను.

హనుమ ముందుగా అత్యంత సుందరమయిన అశోక వనము ధ్వంశము చేసెను. రావణుడు ఈ విషయమును విని ఆ వానరుని సంహరింపమని కింకర రాక్షసులనుబంపెను. ఆ కింకర రాక్షసులనందరిని హనుమ యుద్ధమున సంహరించెను.

మహాకాయుడైన ఆంజనేయుడు ఇట్లనెను. 'రామ లక్ష్మణులకు జయము. రాజు సుగ్రీవునికి జయము. నేను శ్రీరాముని దాసుడను. ఎందరు రాక్షసులనయినను సంహరించి, లంకను ధ్వంశమొనర్చి శ్రీరాముని వద్దకు వెళ్లెదను' అని.

రావణుడు వెంటనే ప్రహస్తుని పుత్రుడగు జంబుమాలిని హనుమతో యుద్ధమునకు పంపెను. జంబుమాలి అత్యంత బలవంతుడు. అట్టివాడు హనుమ ధాటికి హతుడయ్యెను.

రావణుడు, కృద్ధుడయి అతి బలవంతులయిన ఏడుగురు మంత్రిపుత్రులను హనుమ పైకి పంపెను. వారిని కూడ హనుమ సంహరించెను. పిదప హనుమతో యుద్ధము చేయుటకు అయిదుగురు సేనాధిపతులనుబంపెను. వారు కూడా హనుమచే హతము కాబడిరి.

ఈ పిదప రావణుడు తన తనయుడు, మహా యోధుడు అయిన అక్ష కుమారుని హనుమతో యుద్ధమునకు బంపెను. అక్ష

కుమారుడు యుద్ధ విద్యలో ఆరి తేరిన వాడు. మహా పరాక్రమశాలి. అట్టి వానితో హనుమ యుద్ధమునకు తలపడెన. అక్ష కుమారుడు హనుమ పయిన మూడు వాడి బాణములు ప్రహరించెను.

హనుమ, అక్ష కుమారుని పరాక్రమమును అభినందించుతూ అతనిని చంపక, విడువకూడదని తలచి అతనిని గూడ సంహరించెను.

హనుమంతుడు అక్ష కుమారుని కూడా వధించెనని తెలిసికొని రావణుడు దుఃఖమును దిగమ్రింగి ఇంద్రునితో సమానమయిన శక్తి గల తన కుమారుడు ఇంద్రజిత్తుతో నిట్లనెను, 'కుమారా! నీవు అస్త్ర విద్యలలో ఉత్తముడవు. దేవతలను గూడ యుద్ధములో జయించిన వాడవు. పెక్కు దివ్యా స్త్రములు సంపాదించిన వాడివి. మన సేనలో ప్రముఖులయిన వారిని ఆ వానరుడు సంహరించెను. ఆ వారనుని సంహరించుటకు గాని బందీగా చేయుటకు గాని నీవే సమర్థుడవు అని చెప్పి, ఇంద్రజిత్తును హనుమతో యుద్ధమునకు బంపెను. యుద్ధ విద్యలో పరాక్రమ శాలి, నిపుణుడు అయిన ఇంద్రజిత్తునకు హనుమకు భీకర పోరాటము జరిగెను. ఇంద్రజిత్తు హనుమపై బ్రహ్మాస్త్రమును సంధించెను. హనుమ తనపై ఏ అస్త్రము పని చేయదని బ్రహ్మ తనకిచ్చిన వరమును జ్ఞప్తికి తెచ్చుకొనెను. అయినను బ్రహ్మాస్త్రమునకు బందీ అయినట్లు కొంత తడువు నటించి రావణుని దర్శింప కుతూహలపడెను.

పవన సుతుని రావణుని వద్దకు తీసుకుని వెళ్లిరి. రావణాసురుని గాంచి హనుమ అచ్చెరువందెను. రావణుడు తేజస్వి, సర్వ లక్షణ



సంపన్నుడు. ఇట్టి రావణుడు అధర్మ మార్గములను వీడిన యడల ఇంద్ర లోకమునకు ప్రభువు కాగలిగినవాడు అని తలచెను.

హనుమను జూచి రావణుడు ఎఱ్ఱనయిన కన్నులతో, మిక్కిలి కోపముతో తన మంత్రి ప్రహస్తునితో, ఈ వానరము ఇచటకు ఎచట నుండి దుమికెను? అశోక వనము నేల ధ్వంశము చేసెను. వీరాధి వీరులయిన రాక్షసులను ఏల సంహరించెను అని అడుగమనెను.

ప్రహస్తుడు ఆంజనేయుని ఈ విధముగా అడిగెను. 'నీవు ఎవరవు? కుబేరునకు గాని, వరుణునకు గాని, యమునికి గాని ఇచ్చటికి దూతవై వచ్చితివా? నీవు నిజము తెలిపిన నిన్ను బంధ విముక్తుని గావించెదము.

హనుమ ఈ విధముగ సమాధానమిచ్చెను. 'నేను ఆంజనేయుడను. వాయు పుత్రుడను. నూరు యోజనముల సముద్రమును లంఘించి ఇచ్చటకు వచ్చితిని. వానర రాజు సుగ్రీవునకు మంత్రిని. వానర రాజు సుగ్రీవుడు నీకు ఈ విధముగా నాచే సందేశము బంపెను.

శ్రీరాముడు దశరధుడను మహారాజునకు జ్యేష్ఠ పుత్రుడు. రాముడు న్యాయ బద్ధుడు, ధర్మ బద్ధుడు. అంచలమయిన శక్తిమంతుడు. తండ్రి దశరధుని ఆనతిననుసరించి రాముడు తన సోదరుడు లక్ష్మణునితో, భార్య జానకితో దండ కారణ్యమున వనవాసము చేయుచుండగా నీవు కపట వేషముతో రామలక్ష్మణులు లేని సమయమున సీతాదేవిని అపహరించి తెచ్చితివి. ఇది ఎంతటి

అపచారము! గొప్ప తపస్సు చేసి దేవతల చేత గాని, అసురుల చేతగాని మరణము లేకుండ వరము పొందితివి. కాని శ్రీరాముడు మానవుడు. సుగ్రీవుడు వానరుడు. ఈ విషయము విస్మరించకుము.

సీతాదేవి సాధారణ స్త్రీయని తలచుచున్నావు. కాని ఆమె లంకా పట్టణము సమస్తమును నశింపజేయగల 'కాళరాత్రి'.

శ్రీరాముడు యశో సంపన్నుడు. మహా విష్ణువుతో సమానమయిన పరాక్రమము గలవాడు. రామునితో యుద్ధము చేయగలవారు ముల్లోకములలోను లేరు. నీవు ధర్మ మార్గమును అనుసరించి సీతమ్మను శ్రీరామునకు అప్పగింపుము. లేని యడల నీకును, నీతో బాటు లంకకును వినాశనము తప్పదు.

ఈ మాటలు విని రావణుడు కృద్ధుడయి హనుమంతుని వధింపమని భటులను ఆజ్ఞాపించెను.

విభీషణుడు, రావణుని సోదరుడు. ధర్మాధర్మ విచక్షణ గలవాడు. అతడు రావణునితో 'హనుమ దూతయే. దూతను చంపుట ధర్మ సమ్మతము గాదు' అని తెలిపెను.

రావణుడు ఇట్లనెను 'కోతికి తన తోక పయిన ప్రీతిమెండు. అందువలన హనుమ తోకకు నిప్పంటించి వదులుడు'.

తమ ప్రభువు మాట విని దుష్ట రాక్షసులు హనుమ తోకకు గుడ్డలు కట్టి నిప్పంటించి వదిలిరి.



హనుమ మండుతున్న తోకతో లంక అంతటను తిరిగి లంకా నగరమును దగ్ధము చేసెను. హనుమకు ఇట్టి శిక్ష పడినదని తెలిసి సీత అగ్ని హోత్రుని హనుమకు ఎట్టి అపాయము జరగరాదని ప్రార్థించెను. అగ్నిహోత్రుని వలన హనుమకు కొంచెమయినను అపాయము కలుగలేదు. నిప్పు అంటించి మండుతున్న తన తోక తనకు చల్లగా తగిలినదని హనుమ ఆశ్చర్య చకితుడాయెను. హనుమ తన తోకను సముద్రమున ముంచి నిప్పును ఆర్పెను.

ఇంతలోనే హనుమకు ఒక సందేహము కలిగెను. నేను లంకను గాల్చితిని. సీతాదేవికి ఏమి కష్టము గలిగెనో అని తల్లడిల్లెను. అప్పడు చారుణులు ఇట్లు బలికిరి. 'లంక దహింపబడెను కాని సీతాదేవికి ఎట్టి ఆపద కలుగలేదు' అని.

పరమ సంతోషముతో హనుమ సీతాదేవిని మరల దర్శించెను. సీతాదేవి క్షేమము తెలిసికొని ఆమె వద్దనుండి శలవు గైకొని కిష్కిందకు బయలుదేరెను.

జాంబవత అంగదాదులందరు హనుమ రాకకయి ఎదురు చూచుచుండిరి. వానర శ్రేష్ఠుడగు, హనుమ మహేంద్ర పర్వతమును జూచి సింహనాద మొనర్చెను. జాంబవంత, అంగదాదులను, మిగిలిన వానరులను చూచి హనుమ మిక్కిలి సంతసించెను.

హనుమ 'సీతను జూచితిని' అని పలుకకగానే వానరులందరు అమితమయిన సంతోషమును వ్యక్తపరిచిరి. వారందరును రామ లక్ష్మణులను, సుగ్రీవుని జేరుటకు బయలుదేరిరి. త్రోవలో సుగ్రీవునకు

జెందిన మధువనములో మధువును సేవించి సేద తీరి కిష్కింధకు జేరిరి.

హనుమ శ్రీరామునికి నమస్కరించి 'సీతమ్మను జూచితిని' అని పలికెను. శ్రీరాముడు ఆ మాట విని మిక్కిలి సంతోషముతో 'సీత ఎట్లున్నది? నాకు ఏమి సందేశము పంపినది అని ఆతృతతో హనుమను ప్రశ్నించెను.

హనుమ తాను సీతాదేవిని సందర్శించిన విధమునంతయు దెలిపి జానకి క్షేమముగా ఉన్నదనెను. కాని రావణుని అతఃపురములో అతి క్రూరముగ నిర్బంధించబడినదని ఒంటి జడ ధరించి దీనురాలై ఒంటరిగా అసురులు చుట్టు ముట్టగా సతతము శ్రీరామునే ధ్యానించుచున్నదని తెలిపెను.

సీతాదేవి శ్రీరామునకు ఈ విధముగా సందేశము పంపెనని తెలిపెను.

'ప్రియ రామా! చిత్ర కూటమునకు ఈశాన్యమున గల సిద్ధాశ్రమములో మనము సేద తీరుతుండగ నేను అలసి నీ తొడపై నిద్రించితిని. పిదప నా తొడపై నీవు నిద్రించితివి. ఒక కాకి మాంసము పయిన ఆశతో నా స్తన మధ్య భాగమున ముక్కుతో పొడిచినది. ఆ కాకి మాటి మాటికి వచ్చి నన్ను గాయ పరచినది. నా గాయము నుండి స్రవించు రక్త బిందువులచే నీవు తడిసి నిద్ర నుండి లేచితివి. నెత్తురు కారుతున్న స్తనములతోనున్న నన్ను చూచి మిగుల కృద్ధుడవయి నలువైపుల పరికించగ రక్తముతో నిండి యున్న గోళ్లు గల్గి నాకభి



ముఖముగానున్న కాకిని చూచితివి. ఆ కాకి ఇంద్రుని పుత్రుడు. నీవు కోపించి ఆ కాకిపయిన బ్రహ్మాస్త్రమును అభిమంత్రించితివి. ప్రళయాగ్ని వలె మండుచున్న ఆ దర్భ కాకిని వెంబడించెను. తనను అగ్ని నుండి రక్షించువారి కొరకు ఆ కాకి అన్ని లోకములలో తిరిగెను. వానితండ్రి ఇంద్రుడు గాని, దేవతలు గాని, మహర్షులు గాని వానిని రక్షింపలేక పోయిరి. ఆ కాకి తిరిగి తిరిగి నీ వద్దకే వచ్చి శరణు వేడినది. శరణుగోరు వారిని రక్షించ స్వభావముగల నీవు ఆ కాకిని చంపక కరుణించితివి. బ్రహ్మాస్త్రము దేనినయినను నశింప చేసిన గాని ఊరకపోదు. అందువలన ఆ కాకి కుడికన్ను గ్రుడ్డిదగునట్లు చేసితివి. నా నిమిత్తయి నీవు సాధారణమయిన చిన్న పక్షియగు కాకిపయిన బ్రహ్మాస్త్రము ప్రయోగించితివి. ఇప్పుడు నీ వద్ద నుండి నన్ను అపహరించిన మహా పాపియగు రావణుని సంహరింపక ఏల ఉపేక్షించుచుంటివి? రావణుడు నాకు ఇచ్చిన గడువు రెండు నెలల దినములు మాత్రము గలదు. అంతలో నన్ను ఈ చర నుండి విడిపింపమని అభ్యర్థించుచుంటిని.

మన వివాహ సమయమున నా తండ్రి గారయిన జనకుడు నాకు మహోన్నతమైన చూడామణిని బహూకరించిరి. నా గుర్తుగా నీకు ఈ చూడామణిని హనుమ చేత పంపుచుంటిని. దానిని గ్రహింపుము అని తెలిపెను.

శ్రీరాముడు ఆ చూడామణిని తిలకించ సీతను మరీ మరీ తలచుకొని దుఃఖించెను.

హనుమ శ్రీరామునితో ఇట్లు పలికెను.

శ్రీరామచంద్రా! నేను సీతమ్మను ఊరడించి శ్రీరామ లక్ష్మణులు వానర సేనతో వచ్చి రావణుని సంహరించి వన వాసము నుండి తరలి నీతో వైభవముగ పట్టాభిషిక్తుడగును. ఇట్లు ప్రీతిగల మాటలు జెప్పి సీతామాతకు ఉపశమనము గల్గించితిని.

ఆంజనేయ మతి పాట లాననం
కాంచనా దికమనీయ విగ్రహమ్
పారిజాత తరుమూల వాసినం
భావయామి పరమానంద నందనమ్
యత్ర యత్ర రఘునాధ కీర్తనం
తత్ర తత్ర కృత మస్త కాంజలిమ్
భాష్ప వారి పరిపూర్ణలోచనం
మారుతిం నమత రక్షసాంతకమ్

**- సమాప్తం -**